

జాతీయ రహదారిపై మురళీనగర్ సర్వీస్ రోడ్డు



సర్వీస్ రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

నరక రహదారి

- మురళీనగర్ సర్వీస్ రోడ్డులో ప్రమాద ఘంటికలు
- వానొస్తే నిలిచిపోతున్న మురుగు, వరద నీరు
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



బిర్లా కూడలిలో మురుగు నీరు

రహదారి మధ్యలో గోతులు

పాలిటెక్నిక్ కాలేజీ వద్ద జీబ్రా లైన్స్ లేని స్పీడ్ బ్రేకర్

మురళీనగర్: జాతీయ రహదారిపై మురళీనగర్ సర్వీస్ రోడ్డులో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఈ మార్గంలో అడుగడుగునా వాహన చోదకులు, ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ఇటువైపు ప్రయాణించడం కష్టతరంగా మారింది. పైగా నిత్యం వాహనాల రద్దీతో ఈ మార్గం ఇరుగ్గా తయారైంది.

వర్షం కురిస్తే తంటాలు

బిర్లా కూడలి నుంచి ఊర్వశి జంక్షన్ వరకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అసలే వర్షా కాలం కావడంతో ఇక్కడి సర్వీస్ రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. వర్షం నీటితో రహదారి మురుగు కూపంలా మారుతోంది. బిర్లా కూడలి, ఎగువ వర్మా కాంప్లెక్స్ అనుబంధ రహదారి ప్రాంతంలో వర్షపు నీరు నిలిచిపోతోంది. ఎగువ నుంచి వచ్చే నీరు రహదారి దిగువలో నిలిచిపోవడం వాహన చోదకుల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. జాతీయ రహదారిలో వర్షపు నీరు బయటకు పోయే మార్గాలు మూసుకుపోయాయి. దీనికి శాశ్వత పరిష్కారం కుదరడం లేదు. వాన నీటి వరదకు బిర్లా కూడలిలో మురుగు నీటి కాలువలో చెత్త పేరుకుపోయి ఇటీవల చిన్నారులు ఇందులో పడి ప్రాణాపాయ పరిస్థితి ఎదుర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు జరుగుతున్నా.. జాతీయ రహదారి, జీవీఎంసీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం.

చీకట్లో ప్రమాదకర ప్రయాణం

ఈ సర్వీస్ రోడ్డులో రాత్రి పూట ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. సూర్యానగర్ నుంచి ఊర్వశి కూడలి వరకు ఇరువైపులా చెట్లు పెరిగి పచ్చదనం గొడుగులా ఉంటుంది. ఉదయం పూట చల్లగా ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. ఇక్కడ రహదారిని ఆనుకుని ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు సర్వీస్ రోడ్డుపై వెలుగులు ప్రసరించకపోగా.. ఉన్న లైట్లు వెలగడం లేదు. కొన్ని స్తంభాలకు లైట్లే లేవు. రహదారి మధ్యలో ఉన్న గోతులు, కాలువ నిర్మాణం కోసం రహదారి పక్కనే వేసిన సామగ్రి వాహన చోదకులకు ప్రమాదకరంగా మారాయి. పాలిటెక్నిక్ కాలేజీ వద్ద వేసిన స్పీడ్ బ్రేకర్లకు జీబ్రా చారలు వేయకపోవడం వల్ల అవి కనిపించక వాహన చోదకులు దీన్ని ఢీకొని గాయాల పాలవుతున్నారు. సత్యానగర్ వద్ద జాతీయ రహదారి జీబ్రా క్రాసింగ్ వద్ద ప్రైవేటు బస్సులు ఆగడంతో రోడ్డు దాటే పాదచారులు ప్రమాదాల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మురళీనగర్ సర్వీస్ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్ టౌన్ సీఐ ఉమాకాంత్

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు తమ ప్రవర్తను మార్చుకుని, సత్ప్రవర్తనతో మెలగాలని ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ సీఐ ఉమాకాంత్ సూచించారు. ఆదివారం స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లుకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు ఎటువంటి గొడవలు, తగాదాల్లో తలదూర్చకుండా మంచిగా నడచుకోవాలన్నారు. హద్దులు మీరితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ రవికుమార్

మద్రిపాలెం: రౌడీ షీటర్లు నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ రవి కుమార్ హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై పోలీసుల నిఘా ఎల్లవేళలా ఉంటుదని, హద్దుమీరి ప్రవర్తిసే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



బొత్స సత్యనారాయణతో అదీప్‌రాజ్, పార్టీ నాయకులు

మహారాణిపేట: శాసన మండలి ప్రతిపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ (ఉత్తరాంధ్ర జోన్) అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం కలుసుకున్నారు. విజయనగరంలోని బొత్స నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తనకు పదవి రావడంలో సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని బలోపేతం చేసే దిశగా అదీప్‌రాజ్‌కు బొత్స పలు సూచనలు చేశారు. పార్టీ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు కోడిగుడ్ల దేవిసాంబ, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్‌కుమార్, పార్టీ పెందుర్తి మండల అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, వార్డుల అధ్యక్షులు రాపర్తి మాధవరావు, తామర్ల నర్సింగ్, పరవాడ మండల యువజన విభాగం అధ్యక్షుడు బండారు శ్రావణ్, అంబటి శైలేష్, వేపాడ శ్రీను, మణికంఠ, శ్రీను పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబకు హారతి సమర్పిస్తున్న అర్చకుడు శ్రీకాంత్‌శర్మ

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యే చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటిని పరీక్షిస్తున్న వైద్య నిపుణురాలు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెయిన్‌బో కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఈస్ట్ పార్క్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి పర్యవేక్షణలోజరిగిన ఈ శిబిరాన్ని జిల్లా 101 గవర్నర్ కె.ద్వారకానాథ్ ప్రారంభించారు. నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ వికాసిని, డాక్టర్ సుకేష్, ఆప్తమాలజిస్ట్ మేఘన 60 మందికి నేత్ర వైద్య పరీక్షలు చేశారు. కంటి ఆరోగ్య రక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ వికాసిని వివరించారు. పరీక్షలు చేయించుకున్న వారికి ఎలక్ట్ గవర్నర్ ఆర్.ఆర్.ఆర్ మహేష్ చేతుల మీదుగా రూ.500 విలువ కలిగిన కూపన్లు ఉచితంగా అందించారు. రెయిన్‌బో ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ రాంబాబు, క్లబ్ కార్యదర్శి పి.కమల, ఉపాధ్యక్షురాలు సిహెచ్.వరలక్ష్మి, ఎడిటర్ శ్రీమతి శిరీష, వరలక్ష్మి, మణి శిబిరం నిర్వహణకు సహకరించారు.

అనాథ బాలికలకు అన్నదానం

కంచరపాలెం: కంచరపాలెం దుర్గానగర్‌లోని హనీ హన్నా బాలికల సంరక్షణ కేంద్రంలో అనాథ బాలికలకు ఆదివారం సీనియర్ జర్నలిస్ట్ శ్రీలత అన్నదానం చేశారు. సంపాదనలో కొంత భాగాన్ని ఎప్పుడూ సేవా కార్యక్రమాలకు కేటాయించడంలో సంతృప్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సంరక్షణ కేంద్రం సభ్యులు, బాలికలు పాల్గొన్నారు.

సామరస్యంతోనే ప్రపంచ శాంతి



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, నరవ ప్రకాశరావు

సీతంపేట: హిరోషిమా, నాగసాకి సంస్మరణ దినం సందర్భంగా ప్రపంచ శాంతిని కోరుతూ ఐఏఆర్ఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సదస్సు నిర్వహించారు. సంస్థ చైర్మన్ నరవ ప్రకాశరావు అధ్యక్షతన ముందుగా మహాత్మా గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించి, ప్రపంచ శాంతిని కోరుతూ సర్వమత ప్రార్థనలు చేశారు. ఐఏఆర్ఎఫ్, యూఎన్‌వో ద్వారా ప్రపంచ శాంతి కోసం సభ్య దేశాల సహకారంతో నిరంతరం కృషి చేస్తోందని ప్రకాశరావు తెలిపారు. ఆచార్య వి.బాలమోహన్‌దాస్, డాక్టర్ నాగసూరి, వేణుగోపాల్, బ్రహ్మకుమారి రామేశ్వరి మాట్లాడుతూ వివిధ వర్గాలు, దేశాల మధ్య సామరస్యం సాధించిన నాడే ప్రపంచ శాంతి సాధ్యమన్నారు. 80 ఏళ్లుగా యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయని, ప్రపంచ శాంతి కోసం వాటిని మానుకోవాలని హితవు పలికారు. మానవాళికి కావాల్సింది అణు బాంబులు కాదని, అన్నం, వస్త్రం కావాలన్నారు. అనంతరం శాంతి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి, కరుణ, నరసింహారావు పాల్గొన్నారు.

నాలుగు పుస్తకాల ఆవిష్కరణ



పౌర గ్రంథాలయంలో పుస్తకాలు ఆవిష్కరిస్తున్న పూర్వ ఎంపీ శంకరరావు, అతిథులు

సీతంపేట: విశాఖ సంస్కృతి ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఒకేసారి నాలుగు పుస్తకాలు ఆవిష్కరించారు. విశాఖ సంస్కృతి 13వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో అతిథుల చేతుల మీదుగా నాలుగు పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. రచయిత మోణంగి ప్రవీణ రచించిన తొలి అడుగులు కథా సంపుటి, గన్నవరపు నరసింహమూర్తి రచించిన మిథునం, గన్నవరపు నరసింహమూర్తి కథలు, మంచి సినిమాల పుస్తకాలను అతిథులు పూర్వ ఎంపీ డి.వి.జి.శంకరరావు, గరివిడి పశు వైద్యశాల డీన్ డాక్టర్ మక్కెన శ్రీను, అఖిల భారత ధర్మకర్త చెరువు రామకోటయ్య, సత్య విద్యా సంస్థల డైరక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆవిష్కరించారు. అనంతరం విశాఖ సంస్కృతి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ తెలుగు సాహిత్యం, తెలుగు భాష ఉన్నతికి 13 ఏళ్లుగా పాటుపడుతున్న విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు నిస్వార్థ కృషిని అభినందించారు. మంచి ఇతివృత్తం ఉన్న కథలు, సాహిత్యం, చారిత్రక అంశాలు, కవితలు ప్రతి నెలా అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన హాస్య కథలు, కవితల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రచయిత మేడా మస్తాన్‌రెడ్డి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

జూలో సింహాలపై అవగాహన



వెటర్నరీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న క్యూరేటర్ మంగమ్మ

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో ప్రపంచ సింహాల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూ బయోస్కోప్‌లో నిర్వహించిన సమావేశంలో సందర్శకులు, వెటర్నరీ విద్యార్థులకు సింహాలపై అవగాహన కల్పించారు. క్యూరేటర్ జి.మంగమ్మ మాట్లాడుతూ పర్యావరణంలో సింహాల ప్రాధాన్యం, జూ పార్కుల్లో వాటి సంరక్షణ చర్యలను వివరించారు. జూ పార్కులో ఒక జత సింహాలున్నాయన్నారు. వాటి సంరక్షణకు నిరంతరం జూ వెటర్నరీ సిబ్బంది, యానిమల్ కీపర్లు జాగ్రతలు తీసుకుంటున్నారన్నారు. వాటికి అందిస్తున్న వైద్య సేవలు, ఆహారం, జాగ్రత్త చర్యలను వివరించారు. ఇటీవల జూలో ఒక సింహాన్ని వివేక్ గోయంకా అనే వ్యక్తి దత్తత తీసుకున్నారన్నారు. మిగిలిన వన్యప్రాణులను కూడా దత్తత తీసుకోవడానికి దాతలు ముందుకు రావాలని ఆమె కోరారు. దత్తత తీసుకున్న వారికి ఆదాయ పన్నులో 50 శాతం వరకు మినహాయింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జూ అసిస్టెంట్ క్యూరేటర్లు బి.గోపి, పి.వి.చౌదరి, వెటర్నరీ వైద్యుడు పి.భానుబాబు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్లో సైక్లింగ్ పోటీలు



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ గంగారావు, సీఐటీయూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం స్లో సైక్లింగ్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టౌన్‌షిప్‌లో నిర్వహించిన 5 కిలోమీటర్ల సైకిల్ ర్యాలీలో సేవ్ వైజాగ్ స్టీల్ అంటూ నినాదాలు చేశారు. ర్యాలీని ప్రారంభించిన 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌పై బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా అభిప్రాయం వెల్లడించినా విశాఖ ఎంపీ శ్రీభరత్ ప్రతిఘటించకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సీటూ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ కర్మాగారంలో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తూ ప్లాంట్ భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరాజు, పుల్లారావు, మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు పందిరి రాట



రవీంద్రనగర్‌లో పందిరి రాట వేస్తున్న కర్రి రామారెడ్డి దంపతులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఊర్వశి కూడలి రవీంద్రనగర్‌లో షణ్ముఖ్ యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ముఖ్య అతిథి వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కర్రి రామారెడ్డి దంపతులు పందిరి రాట వేసి ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా రామారెడ్డి మాట్లాడుతూ వినాయక ఉత్సవాలకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని షణ్ముఖ్ యూత్ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో కుట్టా కార్తీక్, సభ్యులు సిహెచ్.పవన్‌కుమార్, పి.సుధా, పి.శేఖర్, దినేష్, రాజా, వసంత్, వేణు, గణేష్, కిషోర్, తరుణ్‌కుమార్, మణి, అప్పన్న, నాగేశ్వరరావు, నాగరమేష్, బాల, సందీప్, మహిళలు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి ఘనంగా శ్రావణ పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మి పూజలు ఆదివారంతో 17వ రోజుకు చేరాయి. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో 12 మంది ఉభయదాతలు, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సహాయ ఇంజినీర్ డీవీఎస్ రామరాజు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, వేదపండితులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కనువిందుగా శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం



శిల్పారామంలో నృత్య రూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శిల్పారామం(జాతర)లో ప్రదర్శించిన కలియుగ దైవం శ్రీనివాసుడు, పద్మావతి కల్యాణం నృత్య రూపకం కనువిందు చేసింది. కళాకారుల అభినయం ప్రేక్షకులను తన్మయపరచింది. నగరంలోని శివ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి జానపద నృత్యాల ప్రదర్శనలో భాగంగా నృత్యం చేశారు. కళాకారులు సాయిశ్రీ నిత్య, ప్రణతి, హిమవర్షి, కార్తీక, హర్షప్రియ, నిత్యశ్రీవాణి, మీనా, తన్మయిశ్రీ నృత్యం చేయగా.. ఎస్.మౌనిక నృత్య దర్శకత్వం వహించారు.

ప్రతి ఏటా శబరిమలలో నిత్యాన్నదానం



చిన్ముద్ర సేవా ట్రస్టు సమావేశంలో పాల్గొన్న పైలా ఆదిమోహన్‌రెడ్డి, ఇతర సభ్యులు

సీతంపేట: విశాఖలో నూతనంగా ప్రారంభించిన అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మండల, మకర జ్యోతి సీజన్లలో శబరిమల వెళ్లే అయ్యప్ప భక్తుల కోసం అక్కడ నిత్యాన్నదానం నిర్వహించనున్నట్టు ట్రస్టు సభ్యుడు పైలా ఆదిమోహన్‌రెడ్డి తెలిపారు. శంకర మఠంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అయ్యప్ప భక్తులతో ట్రస్టు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రస్టు ద్వారా చేపట్టబోయే సేవా కార్యక్రమాలను వివరించారు. ప్రతి ఏటా నవంబర్ 16 నుంచి జనవరి 17 వరకు శబరిమలలో తమ ట్రస్టు తరఫున నిత్యాన్నదానాన్ని మూడు పూటలా నిర్వహిస్తామని చెప్పారు. భక్తులకు వైద్య సేవలందించేందుకు వీలుగా ఒక అంబులెన్స్ అందుబాటులో ఉంచుతామన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇతర రాష్ట్రాల వారికి బోర్డు సభ్యులుగా స్థానం కల్పిస్తున్న విధంగా తెలుగు రాష్ట్రాల వారికి ట్రావెన్‌కోర్ బోర్డులో అవకాశం కల్పించాలని కోరారు. ఇరు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ట్రావెన్‌కోర్ బోర్డును కోరనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రుద్ర కోటేశ్వరరావు, రాజేష్ గౌడ్, అనంతరావు, వైకుంఠరావు, శ్రీహరి, మస్తాన్‌రెడ్డి, రమణ, వీరాస్వామి పాల్గొన్నారు.

విద్యుత్ నిర్వహణ పనులు ఇలాగేనా..?



ఏఎస్సార్ నగర్‌లో విద్యుత్ సిబ్బంది నరికి వదిలేసిన చెట్ల కొమ్మలు

మురళీనగర్: ఏపీఈపీడీసీఎల్ అధికారుల పనితీరుపై ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. వీరు వారానికోసారి సబ్‌స్టేషన్, 11 కేవీ ఫీడర్ల నిర్వహణ, సరఫరా లోపాల సవరణలో భాగంగా కండక్టర్ల దిగువన ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తుంటారు. ఆరోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే ప్రాంతాల వివరాలు ప్రకటించాలి. ఎటువంటి ప్రకటనలు ఇవ్వకుండా వీరు తమ పని కానిస్తుండటంతో నివాసులు ఇబ్బందులు పడడం పరిపాటిగా మారింది. అంతే కాదు తొలగించిన చెట్ల కొమ్మలను తరలించడం లేదు. ఇలా వారాల తరబడి వదిలేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. తాజాగా మురళీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో చెట్లు కొమ్మలు తొలగించి వదిలేశారు. ఏఎస్సార్ నగర్‌లో పాఠశాల, ఆస్పత్రి సమీపంలో రహదారి పక్క చెట్ల కొమ్మలు తొలగించి నాలుగు రోజులుగా వదిలేశారు. ఇలాంటి సంఘటనలపై పత్రికల్లో కథనాలు వచ్చినా.. వీరిలో మార్పు రావడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. వీటిని ఎవరు తొలగిస్తారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ ప్రచారం



స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా భూపేష్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

అల్లిపురం: స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వ్యవస్థ అంతా అదానీ చేతిలోకి వెళ్లిపోతుందని సీపీఎం సీనియర్ నాయకుడు వై. రాజు అన్నారు. జగాంబ జోన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కర్ర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం భూపేష్‌నగర్‌లో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు సెల్‌ఫోన్ రీచార్జి చేసుకునే విధంగా ముందుగానే చేసుకోవాలని, ఎక్కువ ఏ టైములో విద్యుత్ వాడతామో ఆ టైంలో యూనిట్ రేట్ ఎక్కువగా చూపిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్మార్ట్ మీటర్లను ప్రజలందరూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు పెట్టిస్తే పగలగొట్టండి అని పిలుపునిచ్చిందన్నారు. ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని స్మార్ట్ మీటర్లు పెట్టడానికి ప్రయత్నిస్తుందని ప్రశ్నించారు. భూపేష్‌నగర్ లో మహిళలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సీపీఎం ఇచ్చిన స్టిక్కర్లను స్వచ్ఛందంగా వాళ్ల మీటర్ పక్కనే అంటించి ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్ మీటర్లను అనుమతించబోమని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జగదాంబ జోన్ కన్వీనియన్స్ కమిటీ కన్వీనర్ ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.